# నేర్వరాని విద్య

ఆమె మనసంతా చికాగ్గావుంది. అప్పుడే అయిదున్నర అయింది : ఇరవయి నిమిషాలనుంచి తాను యిక్కడ పడిగాపులు పడివుంది. తనలాగే నిలువు ముఖాలు వేసుకుని నించున్న-వాళ్లలో యీ సరికి చాలమంది వెళ్లిపోయారు. తను ఒక్కత్తే నిలబడింది. ఇప్పుడు టౌన్‌హాల్ మెట్లమీద.

జీవితంలో యిదో ఇరుకయిన సందర్భం.

ఆమె 'కెనరాబ్యాంక్'లో పనిచేస్తూంది. అయిదు గంటలకు ఆఫీసు అయిపోతుంది. అయిదూపది అయేసరికి తాను బయటకు వచ్చి టౌన్‌హాల్ మెట్లదగ్గర నిలుచుంటుంది. చేతిలోని పుస్తకం పేజీలు తిరుగవేస్తూ కాలక్షేపం చేస్తుంది పదినిమిషాలపాటు ఇంతలో 'మేయోహాల్'లో పని చేస్తున్న ఆమె భర్త స్కూటర్‌మీద వచ్చి టంచనుగా తను నిలుచున్న చోటుకు ముందుగా ఆగుతాడు. ఇద్దరూ చిరునవ్వులు 'ఎక్స్చేంజ్' చేసుకుంటారు. తను 'పిలియన్' పైన కూర్చుంటుంది. 'వానిటీ బ్యాగ్' వొళ్లో పెట్టుకుని ఒకచేయి దానిమీద వేస్తుంది. కుడిచేయి భర్త భుజంమీద వేస్తుంది. అతను స్కూటర్ ముందుకు దూకిస్తాడు. మరోపావుగంటలో 'జయనగర్'లో వున్న తమ ఇంటి ముందు స్కూటర్ ఆగుతుంది. భర్త స్కూటర్ పార్క్‌చేసి వచ్చేలోపల తను ఇంటితాళంతీసి గదుల తలుపులన్నీ తెరుచుకుని వంటగదిలోనికి చేరుకుంటుంది. అయిదే అయిదు నిమిషాలలో 'స్టీం హాట్ కాఫీ' కప్పులు రెండు డ్రాయింగ్ రూం లోనికి తీసుకు వస్తుంది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతారు. తరువాత యేంచేయాలి, యెక్కడయినా బయటకు వెళ్ళేపని వున్నదా లేక ఇంటి పనులు చూచుకుంటూ వుండడమేనా అనేది ఆరోజు అవసరాలను బట్టి నిర్ణయించుకుంటారు. ఇదీ వాళ్ల జీవితంలో దిన చర్య. ఏ సన్నివేశమయినా

కాస్త అటుయిటు కావచ్చునుగాని ఇదిమాత్రం 'టంచను'గా టైంప్రకారం జరగడమే మామూలు.

కాని యీ రోజు యెందుచేతనో భర్తరావడం ఆలస్యం అయింది. ఇన్నిరోజులు యెప్పుడూ ఇలా ఆలస్యం కాలేదు. మహా అయితే మరోపది నిమిషాలు, అయిదున్నర అయేలోపల భర్త ఆకాశం చీల్చుకు వచ్చినట్లుగా తన ముందు స్కూటర్‌తో సహా ప్రత్యక్షం అవుతాడు. ఇవాళ ఎందుకనో ఇంకా రాలేదు. ఆమె గడియారం చూచుకుంది. పావుతక్కువ ఆరు. ఎప్పుడయినా మరీ ఆలస్యం అవుతుందనిపిస్తే భర్త తనకు ఫోన్ చేసి చెబుతాడు ముందుగానే. ఒక అరగంట, గంట లోపు అయితే తను మార్కెట్ వైపు వెళ్ళి 'షాపింగ్' ఏదయినా చూచుకుని టౌన్‌హాల్ దగ్గరకు వస్తుంది. మరీ ఆలశ్యం అయిపోతుందంటే ఇంటికి వెళ్ళిపొమ్మని చెబుతాడు అతను. తను ఆ ప్రకారం చేస్తుంది. అప్పుడు ఏమీ యిబ్బంది వుండదు.

తనకేమీ 'ఫోన్‌కాల్' రాలేదు యీ రోజు. ఏ సమాచారమూ తెలియలేదు. కనుకనే తను టౌన్‌హాల్ మెట్ల దగ్గర పడిగాపులు పడి నిలచి వుంది. —ఆమె యిలా ఆలోచిస్తూ వుండగానే గడియారం ఆరుగంటలు చూపింది, ఒక్క నిమిషంపాటు ఆలోచించింది ఆమె - 'ఇప్పుడు యేం చేయాలి?' అని. తన దారిని తను యింటికి వెళ్ళిపోవడమే మార్గం అని తోచింది ఆమెకు. అనుకోకుండా యేదో పని తగిలివుంటుంది. అందుచేతనే అతను ఫోన్ చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. అందుచేత యిక్కడ కనిపెట్టుకు వుండటానికంటె తిన్నగా యింటికి వెళ్ళిపోయి, ఆయన తన పని ముగించుకు వచ్చేసరికి, కాస్త కాఫీ అయినా తయారుచేసి వుంచవచ్చును,

అయితే ఎలా వెళ్ళడం?

ఈ 'పీక్ అవర్'లో తనకు బస్సులు దొరకాలంటే యింకొక గంటో గంటన్నరో ఇక్కడే పడివుండాలి. లేదా 'ఆటో' చిక్కాలన్నా మరికొంత

ఆమె నీరసంగా నవ్వి 'హలో' అంది.

'మీకు టెలిఫోన్ చేయాలని చూస్తే లైన్ దొరకలేదట, మిస్టర్ గోవింద్ నాకు చెప్పారు అయనకు ఆఫీసులో పని తెమలలేదట. మిమ్మల్ని ఇంటికి వెళ్ళిపొమ్మన్నాడు. నేను 'డ్రాప్' చేస్తానని గోవిందుకు చెప్పాను. సరే నన్నారు. నేను రావడం కాస్త ఆలస్యం అయింది - హెవీ ట్రాఫిక్ మూలంగా-' అన్నాడు ఒక్కబిగిని.

జగన్నాథ్ గోవింద్‌కు స్నేహితుడు. ఇద్దరూ ఒకచోటే పని చేస్తారు, అతని మాటలు అబద్ధం అనుకుందుకు లేదు.

'కూచోండి, వెడదాం' అన్నాడు జగన్నాథ్.

ఆమె ఒదిగి 'పిలియన్' పైన కూర్చుంది. భుజం మీద వేయాల్సిన చేయి బిడియంగా కూర్చున్న సీటునే పట్టుకుంది.

స్కూటర్ బయలుదేరింది.

హోటల్ 'రామ్' దగ్గర ఆగింది.

జగన్నాథ్ 'ఒక కప్పు కాఫీ తీసుకు వెడదాం' అన్నాడు. ఆమె మాట్లాడలేదు. స్కూటర్ దిగింది.

అతనూ దిగి స్కూటర్ పార్క్ చేసి వచ్చాక 'ఇప్పటికే ఆలస్యం అయింది. త్వరగా ఇంటికి వెళ్ళాలి' అంది.

'ఫరవాలేదు లెండి. అయిదు నిముషాలు-' అని అతను ముందుకు దారితీశాడు.

ఏ. సి. రూంలో తీరుబడిగా కూర్చున్నాక 'మీవాళ్ళు ఎలా వున్నారు? చాలరోజులయింది చూచి-' అంది ఆమె.

'ఫైన్' అన్నాడు జగన్నాథ్.

బేరర్ రావడంతోటే స్వీట్, హాట్, కాఫీ ఇంకా ఏవేవో పురమాయించాలని చూచాడు. కాని ఆమె పడనివ్వలేదు. 'ఒట్టి కాఫీ చాలుగాక

చాలును' అంది. ఈ సమయంలో టిఫిన్ తింటే తనకు వాంతి అయిపో తుందంది. ఆమెను ఒప్పించడం యెలాగో తెలియక, ఇద్దరూ కాఫీ తాగి పది నిమిషాలలో ఇవతల పడ్డారు. తిరిగి స్కూటర్ స్టార్ట్ అయిన తర్వాత ఆమె గమనించింది - దారి తప్పినట్లు. ముందు తమ ఇల్లు రావాలి; తరు వాతనే జగన్నాథ్ ఇల్లు. అతను పెద్దరోడ్ తప్పించినట్లున్నాడు.

'ఎక్కడకు తీసుకు వెడుతున్నారు ?'

'కాస్సేపు మా యింటికి వెడదాం. చాలా రోజు లయిందన్నారుగా మా వాళ్ళను చూచి—' అన్నాడు జగన్నాథ్. అవును స్కూటర్ వెడు తున్నది అదే దిక్కు.

ఈ సంగతి తనకు ముందే చెప్పవలసింది. తనుయిలా అడిగిన తరువాత కాదు—అనుకుంది ఆమె. నిట్టూర్చడం తప్ప యింకేం చేయలేక పోయింది.

స్కూటర్ జగన్నాథ్ యింటిముందు ఆగింది.

ఇద్దరూ లోనికి వెళ్లారు.

అమె డ్రాయింగ్ రూంలోనే కూర్చుండిపోయింది. సావిత్రి వస్తుం దేమోనని ఎదురుచూచింది

సావిత్రి కూడా చదువుకున్న పిల్లే. కాకపోతే వాళ్ళది 'పెద్దలు కుదిర్చిన పెళ్ళి'. సావిత్రికి ప్రేమలు, పెళ్లిళ్లమీద అంత నమ్మకం లేదు. ప్రేమించి పెళ్లిచేసుకున్నవాళ్ళు అంతకంటె యింకేం చేయడం చేతకాని వాళ్లు అన్నట్లుగా ఆమె అనేకమార్లు మాట్లాడడం గుర్తే.

ఆమెకు ప్రేమను గురించి గర్వంగా చెప్పుకోవడం యిష్టంలేదు. కాని తమను ఎవరన్నా చిన్నచూపు చూస్తారన్న భయంతో సావిత్రి యిలా మాట్లాడుతోందని గ్రహించటానికి ఆమెకు ఎక్కువ రోజులు పట్టలేదు. అందుమీద ఆమె మాటలను అంతగా పట్టించుకోలేదు కూడా.

పావుగంట గడిచాక జగన్నాథ్ ఒక్కడే బయటకు వచ్చాడు.

'ఆలస్యం అయిందండీ. క్షమించాలి' అన్నాడు.

ఆమె అతనివైపు విచిత్రంగా చూచింది.

ఏమిటి యీ మనిషి! తనను యిక్కడ ఒంటరిగా కూర్చోబెట్టి లోపలకు వెళ్ళి తాపీగా ముస్తాబయి మరీ వచ్చాడు. కాస్త 'సెంట్' కూడా పులుముకున్నట్లున్నాడు. యేచొక్కా జేబుకో, చేతిరుమాలుకో, గుమ్మని వాసన వస్తోంది.

సెంట్ వాసన ఆమెకు పడదు.

'సావిత్రి ఎక్కడ ?'

జగన్నాథ్ పెదవులు వణుకుతున్నాయి. పిరికిగా నవ్వాడు.

'క్షమించండి. మావాళ్ళు వూళ్ళో లేరు' అంటూ అతను ఆమెకు యెదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

'మీరు యేమీ అనుకోకండి మేడమ్! ఒక్క మాట....' అన్నాడు జగన్నాథ్.

'ఏమిటది'—అన్నట్లు కనుబొమ్మలు ముడిచింది ఆమె.

'క్షమించండి. మీరు కోపం చేసుకోనంటే చెబుతాను-' అంటూ ఆగిపోయాడు.

ఆమెకు చిరాకు అనిపించింది. ఏమిటి యీ మనిషి వాలకం?

ఇంటికి తీసుకుపోతా నన్నవాడు, ఇలా చేయడమే తప్పు - పైగా యేదోనంగి నంగి మాటలు మాట్లాడతాడేమిటి ?

కాని గోవింద్‌కు ముఖ్యస్నేహితులలో ఒకడు. అతడిని 'డిస్‌ప్లీజ్' చేయడం ఆమెకు యిష్టం లేదు. కాని యీ వైఖరి చూస్తూంటే యితనికేమీ సదుద్దేశ్యం వున్నట్లు తోచడంలేదు.

ముఖం మీదికి చిరునవ్వు పులుముకుని 'కోపం చేసుకునే మాట యితే చెప్పకండి. ఆలస్యం అయిపోయింది. వెళతాను ఇంక-' అంటూ లేచింది.

'అయితే చెప్పవద్దంటారా?'

'చూడండి, మిస్టర్ జగన్నాథ్ ... మీరు మాకేం కొత్తవారు కాదు. ఏం చెప్పాలనుకున్నా హాయిగా చెప్పవచ్చు. కాని మీరే ఇలా సందేహిస్తున్నారంటే అదేదో కూడనిమాటే అయివుంటుంది. ఎందుకు అనవసరంగా శ్రమ తీసుకుంటారు. నేను వెళ్లి వస్తాను, సెలవు' అని బయలుదేరింది ఆమె.

జగన్నాథ్ ముఖం పాలిపోయింది.

'-ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను.'

'అక్కర్లేదు లెండి. అయిదు నిమిషాలలో వెళ్ళిపోతానుగా. ఈసరికి జగన్నాథ్ వచ్చారో యేమో!'

'లేదండీ! అతను వచ్చేసరికి ఎనిమిది అవుతుంది'

'అలాగా! థాంక్స్. వస్తాను-' ఆమె అడుగులు బయటకువేసింది.

'మీకు శ్రమ యిచ్చాను' అన్నాడు జగన్నాథ్; ఈమాటు 'డ్రాప్' చేస్తాను అన్నమాటే అతని పెదవుల మీదికి రాలేదు.

ఆమె గబగబ అవతల పడింది.

ముందుకు సాగిపోతున్న ఆమె విగ్రహాన్ని తమ ఇంటి వరండాలో నుంచే చూస్తూ జగన్నాథ్ నిట్టూర్పులు విడిచాడు. 'ఖర్మ! నాకు ఇంతకంటె ధైర్యం ఎప్పుడు ఏడిచింది' అనుకున్నాడు ఉసూరుమంటూ.

* * *

'ముదితా। నీకు యీ మధ్య జగన్నాథ్ కనిపించాడా? నాతో ఎందుకనో ముభావంగా వుంటున్నాడు సుమా!' అని గోవింద్ అన్నప్పుడు గాని యీ సంగతులన్నీ ఆమె మనసుకు మళ్ళీ రాలేదు.

'నాకేం తెలియదే — అన్నట్లుగా అతని వైపు చూచింది.

'ఈ రోజు మధ్యాహ్నం కాఫీకి పిలిచాను. రానన్నాడు అతనికి పెద్దపనేం లేదు మళ్ళీ. ఊరికే డెస్క్ ముందు కూర్చుండి పోయినాడు. అంతకుముందు ఎప్పుడూ ఇలా చేయలేదు' అన్నాడు గోవింద్.

పందల మైళ్ళు తెలుగుదేశం నుంచి విడిపడిపోయి వచ్చి ఇక్కడ ఉద్యోగంలో చేరుకున్న తరువాత జగన్నాథ్‌లాంటి స్నేహితుడు దొరికినందుకు అతని మనస్సుకు యెంత హాయిగా వుండిందీ ! కొత్త సంతోషం - ఉత్సాహం కలిగిందీ ముదితకు ఇంకా గుర్తే. కలిసి చదువుకోకపోయినా. ఇంతకు ముందు ఏమాత్రం పరిచయం లేకపోయినా.... ఇక్కడ ఉద్యోగ ధర్మంకొద్దీ కలుసుకున్న మనుషులు ఇంతగా ఒకళ్ళకొకళ్లు కలిసిపోవడం ముదితకు అప్పట్లో కాస్త విచిత్రంగానే అనిపించింది. ఉన్న వూరు విడిచి రావడంలో కష్టం ఏమిటో తనకు తెలియదు గనుక యీ పరిస్థితి తనకు అర్థం కాదులే - అని సరిపెట్టుకుంది.

గోవింద్ ఉద్యోగం కోసం బెంగుళూరు రావడం, అప్పుడు తమకు పరిచయం అవడం, అది క్రమంగా పెళ్ళిగా పరిణమించడం ముదిత మనోఫలకంలో బహుజాగ్రత్తగా సుకుమారంగా దాచుకున్న అనుభవం.

'మా కుటుంబంలో యెవరూ వర్ణాంతర దేశాంతర వివాహం చేసుకోలేదు. నేనే మొదలు-' అన్నాడతను. అసలు దేశాలు వదిలి, రాష్ట్రం, తాలూకా వదిలి వెళ్ళిపోయినవాళ్ళు కూడా ఎవరూలేరు - అని అతనే మరోమారు చెప్పాడు. అవును, యెటు వచ్చీ పది పదిహేను సంవత్సరాలనుంచే జనం దేశంలో ఒక మూలనుంచి మరోమూలకు సునాయాసంగా కదులుతున్నారు.అంతకు ముందు ఎవరి పరగణాల్లో వాళ్ళు కాళ్ళు జాపుకుని కూర్చునేవారు—అంటాడు గోవింద్.

తన మనసుకు నచ్చినవాడు అనే విషయం తప్ప ఇంకేమీ ఆలోచించలేదు, ముదిత వివాహానికి ముందు. భాష, ఆహారం, అలవాట్లు, ఆలోచనా ధోరణి ఇవన్నీ చాలత్వరగానే పరస్పరం అవగాహన అయిపోయాయి.

ముదిత నవ్వుకుంది.

'ఏం గుర్తు వచ్చిందేమిటి?' అన్నాడు గోవింద్.

'ఏమీ లేదు. అతనికి ఇంటిమీద గాలి మళ్ళిందేమో. రెండు నెలలు సెలవు తీసుకొని తెలుగుదేశం అంతా తిరిగి రమ్మనండి. బెంగ వదులు తుంది' అంది,

'యూ సిల్లీ గర్ల్' అన్నాడు గోవింద్. ఆమె తననే ఆక్షేపిస్తోందని అతనికి తెలుసు. వాళ్ళ సంభాషణ జగన్నాథ్‌మీద ఆట్టేసేపు నిలవలేదు. అయితే ముదిత మనస్సు మాత్రం కదలబారింది.

పాపం! మానవుడు సిగ్గుపడుతున్నాడన్నమాట!

ముఖం చూపించడం చేతకాకుండా పోయివుంటుంది.

అందుకే ఇటువైపు రావడంలేదు. గోవింద్‌తోనూ 'ఫ్రీ'గా 'మూవ్' కావడంలేదు. లేనిపోని అవస్థ కొని తెచ్చుకున్నాడు. అమాయకుడు - అను కుంది ముదిత.

ఆ ఆదివారం ముదిత ప్రతిపాదన మీదనేయిద్దరూ వాళ్ళ ఇంటికి వెళ్ళారు. వాళ్ళు ఇద్దరూ ఇంట్లోనే వున్నారు. జగన్నాథ్ భార్య కిందటి వారమే పుట్టినింటి నుండి రావడంవల్ల అక్కడి సంగతులు విడమరచి చెప్పడంతో సరి పోయింది టైమంతా.

'చాల రోజులయింది మీరు మా ఇంటికి వచ్చి. పై ఆదివారం తప్ప కుండా భోజనానికి రండి' అంది ముదిత వాళ్ళిద్దరివైపు పరిశీనలగా చూస్తూ.

'తప్పకుండా వస్తాం' అంది సావిత్రి. జగన్నాథ్ ముఖంలో ఎలాంటి ఉత్సాహమూ కనిపించలేదు ముదితకు. ఇంటికి వచ్చేసిన తరువాత అడి గింది గోవింద్‌ను 'ఏమంటున్నాడు మీ స్నేహితుడు? పై వారం వస్తాడా?' అని.

'రాడనుకుంటాను'

'ఏం?'

తమ మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పాడు గోవింద్ ఆమెతో.

'-నువ్వు మారిపోయావ్ జగన్నాథ్-' అంటే, అతను 'గోవింద్ నేను రాక్షసుడిని నన్ను పలుకరించకు' అన్నాడు.

'నీకు మతిగాని పోయిందా ?'

'నీతో కొన్నాళ్ళు కలిసి తిరిగితే నా మతి పూర్తిగా పోతుంది, నన్ను వంటరిగా వదిలెయ్యి, ప్లీజ్!' అన్నాడు జగన్నాథ్.

గోవింద్ బాధపడుతూ వుంటే ముదిత 'పోనీలెండి మీకుమాత్రం యెందుకంత బాధ? వాళ్ళ కుటుంబ సమస్యలు యేమున్నాయో-యేమో— అన్నీ అందరితోనూ చెప్పుకోలేరుగా !' అంది.

ఒకరోజు అతని ప్రసక్తి తీసుకువచ్చినప్పుడు గోవింద్ చిరాగ్గా 'నీకు వాడిస్మరణే ఎక్కువయిపోయిందే! నేను మరచిపోదామనుకున్నా వీలుకలిగించవు—' అన్నాడు. ముదితకు ఛెళ్ళున దెబ్బ తగిలినట్లయింది. అతని బాధ గమనించి కొంతలో కొంత ఉపశమనం కలిగించటానికి తాను ప్రయత్నిస్తూవుంటే యిదేమిటి యిలా మాట్లాడుతాడు గోవింద్!

ముదితకు జగన్నాథ్‌స్థితి కాస అగమ్యగోచరమే అయింది. ఎందుకు అంత దెబ్బతిన్నాడు అతను? తానేం కానిమాటలు అనలేదే! అతను చేస్తున్నపనిలో అసందర్భం ఎత్తిచూపించింది. చాకచక్యంగా మాట్లాడి యివతలపడింది. అంతే! మాటల బాణాలయినా ఉపయోగించలేదు తను.

బహుశ తాను గోవింద్‌తో యీ విషయం చెప్పేసి వుంటుందనుకున్నాడేమో! గోవింద్‌తో తనుచెబితే మళ్ళీ జగన్నాథ్‌ముఖం చూడలేదు అతను? వాళ్ళస్నేహం పాడుచేయగూడదనే నోరుమూసుకు కూర్చుంది తను!

గోవింద్‌కు తను యేమీ చెప్పలేదనీ, అతన్నిగురించి ఆయన మనసులో యేమీ దురభిప్రాయం లేదనీ జగన్నాథ్‌కు తెలియచెప్పడం యెలా ?- యిదే ముదితకు దిక్కుతోచకుండా వుంది.

తాత్కాలికంగా మబ్బు పొరలు కమ్మినాయి, జగన్నాథ్ మనసుమీద. ఇంక ఆ మబ్బులలోనుంచి బయటకురాకుండా వున్నాడు అతను. మళ్ళీ ప్రపంచాన్ని మామూలుగ చూచి ఆనందంగా వుండడం చేతకాకుండా పోతోంది అతనికి.

సావిత్రి ఒక్కత్తే తమయింటికి వచ్చినప్పుడు కూడా అంత ఆశ్చర్యం అనిపించలేదు ముదితకు. అతనేదో పనిమీద ఊరికి వెళ్ళాడని విని సమాధానపడ్డాడు గోవింద్.

'అమ్మదొంగా! యిన్నాళ్ళూ ఎక్కడ దాక్కున్నావ్?' అంది ముదిత.

—ఒకపక్క ఉద్యోగం చూచుకుంటూ, సంసారం ఎలా చేస్తారండీ నాకయితే పరమ బోరు, అన్నది సావిత్రి ఒకమారు. ఉద్యోగం చేయడం సరదాకోసం కాదుగా, అవసరంకొద్దీని అని చెప్పగలగడం ముదితకు చేత కాలేదు.

'మీకేమండీ! యిద్దరూ సంపాదిస్తారు. ఎన్నయినా కొంటారు.' అంది సావిత్రి, వాళ్ళను చూచి తాను అసూయ పడుతున్నాననే విషయం బయట పడనీయకుండా—ముదితకు యివన్నీ గుర్తు వచ్చాయి.

'మీరు చాల మంచివారు. మీతో స్నేహం నాకు ప్రాణంకన్నా ఎక్కువ యిష్టం.' అంది ఆమె. ముదితనవ్వి వూరుకుంది.

జగన్నాథ్ వచ్చాక మళ్ళీ వస్తానంటూ వెడుతూ ఆమె మరో రెండు మాటలుకూడా అంది; 'మీరు అందరిలాంటివారు కాదు. అందుకనే మీరంటే యింత యిష్టం-. దీనికి ముదిత నవ్వేసి వూరుకుంది.

గోవింద్ ఆమె వెళ్ళాక ముదితను దగ్గరకు తీసుకుంటూ 'ఎందుకట అంతయిష్టం' అన్నాడు.

'గోడకు చెవులు పెట్టారా? నన్ను అడుగుతారేం. ఆమెనే అడగ లేక పోయినారా? మీ తెలుగువాళ్ళేగా!' అంది ముదిత.

"అయినా నాకంటే నీవే యెక్కువ స్నేహితురాలివిగా! జగన్నాథ్ నన్ను చూడకుండా వుండగలుగుతున్నాడుగాని ఆమె నిన్నువదల్లేకపోతోంది. అదే నాకు విచిత్రం!' అన్నాడు.

'సావిత్రికి యిప్పుడు యెక్కడయినా చిన్న ఉద్యోగంకూడా చూసుకోవాలనిపిస్తోంది!'

'నిజం! ఉద్యోగాలంటే అంత అసహ్యం వున్నమనిషి!'

'దయచేసి నాకు యెక్కడన్నా ఉద్యోగం చూపించండి—అనికూడా అడిగింది నన్ను నాలుగురోజుల క్రితం.'

'అయితే యింకేం-దయచూడు—' అన్నాడు గోవింద్.

'దయ, దాక్షిణ్యం-నా నిఘంటువులో లేవు గదండీ-' అందిముదిత.

'కన్నడ రాజ్యలక్ష్మి! దయలేదా నేను గోవిందుశన్—' అన్నాడు గోవింద్ చేతులు రెండూ ముడిచి దోసిలిపట్టి ఆమెముందు నిలబడి,

ముదిత విశ్రాంతిగా నవ్వింది.

*

(ఆకాశవాణి, మదరాసు కేంద్రం)